క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ : వాహనాలను నడిపే వారు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మండలంలో రికార్డు సక్రమంగా లేని వాహనాలు ఎక్కువగా ఉండటంతో వాటిని గుర్తించటానికి తనిఖీలు చేపట్టామన్నారు. కొందరు తెలియక తక్కువ ధరకు వస్తున్నాయని చోరీ వాహనాలను కొనుగోలు చేస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని. పట్టుబడితే జైలుకు వెళ్లటం ఖాయమని చెప్పారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు.

సర్వే రికార్డుల్లో తప్పులు సవరించండి



అర్జీలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టరు సుధారాణి

బుచ్చినాయుడుకండ్రిగ : రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని డిప్యూటీ కలెక్టరు సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాళెంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడంగళ్ వన్‌బీ, రిజిస్టర్ 22 (ఏ), భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, కబ్జాలు తదితర సమస్యలు రెవెన్యూ సదస్సులో అర్జీలిస్తే అధికారులు పరిశీలించి పరిష్కారిస్తారని తెలిపారు. శ్మశానికి వెళ్లటానికి దారి లేక పోవటంతో శవాన్ని పంట పొలాలలో తీసుకుపోవటానికి నానా అవస్థలు పడుతున్నామని, దారి సౌకర్యం కల్పించాలని కోరారు. రైతులు పలు భూ సమస్యలపై వినతులను ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, వీఆర్‌ఓ భాస్కర్, సర్పంచ్ సుబ్బరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



తిరుచ్చిపై మాడ వీధుల్లో విహరిస్తున్న దేవదేవుడు

నారాయణవనం : తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తుల హారతులను అందుకున్నారు. బుధవారం ఆలయంలో ఏకాదశి ఉత్సవాన్ని నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజ కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనం అధిరోహించి, మాడ వీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గిరిజనులకు ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం : మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీలోని గిరిజనుల పూరిళ్లు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయి. దీనిపై ఇటీవల పెద్ద పాండూరులో పర్యటించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు బాధిత గిరిజనులు విన్నవించారు. తక్షణమే సంబంధిత కుటుంబాలను ఆదుకోవాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా ఇళ్లు కోల్పోయిన 3 కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం, బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, కూటమి నాయకులు త్యాగరాజు, కోటి, చిరంజీవి యాదవ్, స్థానిక సర్పంచ్ కవిత, ఎంపీటీసీ అంకమ్మ, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ శివకుమార్ ఉన్నారు.

ఆటల్లో అదుర్స్

గ్రామీణ ప్రాంతాల పేదింటి పిల్లలు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ అందరి చేత ప్రశంసలు అందుకొంటున్నారు. భర్త మరణానంతరం కుటుంబ భారాన్ని మోస్తున్న కొందరు తల్లులు కన్న బిడ్డలు ఉన్నత విద్య అభ్యసించేందుకు కూలీ పనులు చేస్తూ పిల్లల చదువులు, క్రీడల పట్ల ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తున్నారు.దీంతో వారిపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సత్యవేడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

– సత్యవేడు

- వికసిస్తున్న పేదింటి క్రీడా కుసుమాలు
- రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుతున్న సత్యవేడు విద్యార్థులు
- క్రీడల్లో ఆదర్శంగా ప్రభుత్వ పాఠశాలలు

రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించిన రగ్బీ జట్టు



సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల, బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో తిరుపతి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి మూడో స్థానం కైవసం చేసుకొని జిల్లాకు గుర్తింపును తీసుకొచ్చారు. స్థానికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొంటూనే జిల్లా, రాష్ట్రా స్థాయి పోటీల్లో రాణించి సత్తా చాటుతున్నారు. 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మునీంద్ర, హేమంత్, అబ్దుల్ హుసేన్, పార్థీవ్ వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువు, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు.

ఆస్తకితో సాధన

క్రీడాకారులు రగ్బీలోనే కాకుండా యోగా, బాల్ బ్యాడ్మింటన్, పరుగు పందాల్లో రాణిస్తున్నారు. సత్యవేడు ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుతున్న పేద కుటుంబాల పిల్లలు క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో ఉన్నత చదువులు చదువుకొనేందుకు మరిన్ని అవకాశాలు ఉంటాయనే ఆసక్తితో క్రీడల పట్ల మక్కువ చూపుతున్నారు.

అమ్మ ప్రోత్సాహం



నాన్న చనిపోవడంతో అమ్మ కూలీ పనికి వెళ్లి నన్ను, తమ్ముడిని చదివిస్తోంది. పాఠశాల క్రీడల్లో రాణిస్తున్నానని వ్యాయామ ఉపాధ్యాయులు అమ్మకు చెప్పడంతో సంతోషించింది. అమ్మ ప్రోత్సాహంతో చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొన్నా. జాతీయ స్థాయి పోటీలో రాణించాలనేది నా లక్ష్యం.

– మునీంద్ర, పదో తరగతి, సత్యవేడు

ఉన్నత చదువులకు అవకాశం



క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో డిగ్రీ, పీజీ కోర్సులు చదవచ్చు. నాన్న చనిపోవడంతో అమ్మ కూలీ పనులకు వెళ్లి చదివిస్తోంది. ఒక్కడే కొడుకు కావడంతో అమ్మ ఆశలన్నీ నాపైనే పెట్టుకొంది. చదువు, క్రీడల్లో రాణించి కుటుంబ ఆర్థిక భారం తగ్గించేందుకు కృషి చేస్తా.

–హేమంత్, పదో తరగతి, సత్యవేడు

ప్రత్యేక శిక్షణ



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొన్నా. మండల స్థాయిలో రగ్బీ పోటీలో రాణించడంతో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో రాష్ట్ర స్థాయిలో గుంటూరులో జరిగిన రగ్బీ పోటీలో బాగా ఆడాం. జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు జిల్లాకు మంచి పేరు తీసుకొస్తా.

– అబ్దుల్ హమీద్ , తొమ్మిదో తరగతి, సత్యవేడు

అమ్మ కోరిక నెరవేరుస్తా



బాగా చదివి ఉద్యోగం చేయాలని అమ్మ కోరిక. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో చదువు, ఉద్యోగం పొందవచ్చు. రోజు బడికి వచ్చిపోతూ పరుగు అలవాటు కావడంతో రగ్బీ పోటీలో వేగంగా రన్నింగ్ చేస్తూ విజయం సాధించేందుకు మిత్రులకు సాయపడుతున్నా. నాన్న చనిపోవడంతో ముగ్గురు పిల్లలను అమ్మ చూసుకుంటోంది.

– పార్థివ్, పదో తరగతి, సత్యవేడు

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతాం



పాఠశాలలో క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నాం. విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుకొనేందుకు క్రీడలు దోహదపడుతాయి. జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేలా తీర్చిదిద్దుతున్నాం.

– శ్రీనివాసులు, బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్, సత్యవేడు

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



ఆరూరు రోడ్డు బాగు చేయాలని కోరుతున్న గ్రామస్తులు

సత్యవేడు : ఆరూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. ఆరూరు, అప్పయ్యపాలెం గ్రామాల్లో సర్పంచులు అలిమేలు, పార్వతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రధానంగా ఆరూరు రోడ్డు గుంతలమయమై మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఆరూరుకు ఆర్టీసీ బస్సు నడపాలని అభ్యర్థించారు. ఆరూరు కండిగలో అసంపూర్తిగా ఉన్న సిమెంటు రోడ్డును పూర్తి చేయాలని కోరారు. అప్పయ్యపాళెంలో గ్రామ నత్త భూమి సుమారు 5 ఎకరాలు ఉందని, సర్వే చేసి భూమి చూపాలని సర్పంచ్, గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్ఐ సురేష్, ఎంపీటీసీ సురేంద్ర, హౌసింగ్ ఏఈ బాను, ఆరూరు శేఖర్ పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, బొలెరో వాహనాలు

శ్రీకాళహస్తి రూరల్ : మండల పరిధిలోని నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై కోకో కోలా ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు లారీ, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బొలెరోలోని డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇద్దరిని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

తప్పులతడకగా ఓటరు జాబితా

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులు తయారు చేసిన ఓటరు జాబితా తప్పుల తడకగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఈనెల 14వ తేదీన మండలంలోని పార్లపలి, పల్లమాల, కొత్తపాళెం, జంబుగోళం, ఆలత్తూరు, పుత్తేరి, కంచనపుత్తూరు, కరకంబట్టు, కారణి, కుక్కంబాకం కొత్త చెరువు, కుక్కంబాకం చిన్నచెరువు, నెలవాయి. కల్లివెట్టు చెరువులతోపాటు కాళంగి ప్రాజెక్టు కుడి కాలువకు సంబంధించిన కాటూరు, వీయస్‌పురం, విజయగోపాలపురం, పెద్దపాలేడు, చిన్నపాలేడు, కనమనంబేడు, గాజులపెళ్లూరు, నీర్పాకోట, కాంపాళెం, చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. సాగునీటి ఎన్నికల కోసం 91 మంది సిబ్బందిని నియమించారు. ఒక్కో చెరువుకు ఆరుగురి సభ్యులను ఎన్నుకుని, వారిలో ఒకరు అధ్యక్షుడు, మరొకరు ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ చెరువుల కింద ఉన్న ఆయకట్టు విస్తీర్ణాలు మారిపోవటంతో పాటు చనిపోయిన, ఆయకట్టుతో సంబంధంలేని రైతుల పేర్లతో ఓటరు జాబితాలను నింపేశారనే ఆరోపణలున్నాయి. ఓటర్ల జాబితాలోని తప్పులపై రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదంటున్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన వ్యవహారాలను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సాగునీటి సంఘాల ఓటరు జాబితా తయారీపై రెవెన్యూ అధికారుల వ్యవహారశైలి మరింత విమర్శలకు తావిస్తోంది. గతంలో పొలాలు అమ్మేసిన రైతుల పేర్లు ఓటరు జాబితాలో దర్శమిస్తున్నాయి. కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు తమ పేర్లను జాబితాల్లో నమోదు చేయాలని రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు దరఖాస్తు చేసుకున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి సంఘాల ఓటరు జాబితాకు సంబంధించి అభ్యంతరాలు వచ్చిన వెంటనే విచారణ చేసి తప్పులు సరిచేస్తామని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు.



కంచనపుత్తూరు ఓటరు జాబితా

ఓట్ల గల్లంతు

నాగలాపురం : మండలంలోని గొల్లవారి కండ్రిగ పంచాయతీలోని పాత చెరువు కింద రైతులకు 162 ఎకరాల భూమికి నీటి పారుదల ఉండగా అందులో 132 ఎకరాలు గొల్లవారి కండ్రిగ గ్రామ రైతులదే మిగిలిన 30 ఎకరాలు టి.పి.పాళెం గ్రామ రైతులకు ప్రాధాన్యం ఉంది. శనివారం జరగబోయే ఆయకట్టు ఎన్నికల్లో ఆయా పరిధిలోని ఓట్లు గల్లంతైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 20 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆయకట్టు ఓటరు జాబితానే విడుదల చేస్తున్నారని, ఆ గ్రామానికి చెందిన రైతులు కేవలం 11 మంది పేర్లు మాత్రమే ఉండడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రదర్శించిన ఓటరు జాబితాలో చనిపోయిన వ్యక్తులు, 20 ఏళ్ల కింద నమోదైన రైతుల పేర్లు మాత్రమే ఉన్నాయే తప్ప రెండు, మూడు సంవత్సరాలలో రైతులు కొన్న భూమి వివరాలు ఈ జాబితాలో లేవని, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలనే ఇలాంటి పొరపాట్లు జరిగాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత కలిగిన రైతులకు ఓటు హక్కు కల్పించాలని, లేని పక్షంలో ఎన్నికల రోజున నిరసన తెలియజేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

ప్రజలందరిపై గంగమ్మ దీవెనలు



ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో ఏడుగంగమ్మల జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. ఆయనకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఏడు గంగమ్మల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంఠా ఉదయ్‌కుమార్, స్వామిరెడ్డి భరత్‌రెడ్డి, బీసీ నాయకులు మనోహర్ పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సతీమణి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం ఏడు గంగమ్మల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. అందులో భాగంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్తపేటలో భువనేశ్వరిగా దర్శనమిచ్చిన గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు పాలమంగళం రవి, ప్రమీలమ్మ, ప్రకాష్ పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహం వద్ద బియ్యపు శ్రీవాణిరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న అంజూరు తారక శ్రీనివాసులు

అమ్మవారి సేవలో మాజీ పాలకమండలి చైర్మన్

శ్రీకాళహస్తి : రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తి పట్టణంలో ఏడు గంగమ్మల జాతర నిర్వహించడం ప్రత్యేక సంప్రదాయంగా వస్తోంది. జాతర సందర్భంగా బుధవారం ముత్యాలమ్మగుడి వీధిలోని అమ్మవారిని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, రమేష్, సుధీర్, ప్రసాద్, ఈశ్వరసాయి, సోము, గణేష్ పాల్గొన్నారు.

ఆవుల పెంపకం, వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం నచ్చనేరి సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో బుధవారం తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ, చిల్డ్రన్స్ ఇండియా సంయుక్తంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ఆవుల పెంపకం, వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పల్లం, ఉడమలపాడు, అక్కుర్తి గ్రామాల నుంచి 50 మంది స్వయం సహాయక సభ్యులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఎస్ఓఎస్ కార్యాలయ సమన్వయకర్త సత్యనారాయణ, తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత పాల్గొని ఆవుల పెంపకం, వ్యర్థాల నిర్వహణలో మెళకువలపై అవగాహన కలిగించారు. కుటుంబం బాగుండాలంటే పాడుపు అలవర్చుకోవాలని, లాభసాటిగా ఉండే వృత్తులను ఎంచుకోవాలని సూచించారు. పశువుల పేడ నుంచి సీడ్ బాల్స్, పుట్టగొడుగులు, పూల కుండీలు, దూపం కప్పులు, సేంద్రియ సబ్బులు తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వెటర్నరీ యూనివర్శిటీ పశువైద్య నిపుణులు డాక్టర్ గంగరాజు, డాక్టర్ తిరుపతి రెడ్డి, డాక్టర్ మంజరి పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘాల మహిళలతో తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ అధికారులు

ప్రజా నాయకుడిని కోల్పోయాం

వరదయ్యపాళెం : సత్యవేడులో ప్రజా నాయకుడు బందిల బాలయ్యను కోల్పోయామని, పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. బుధవారం మండలంలోని కంచరపాళెంలో జరిగిన బందిల బాలయ్య కర్మ క్రియల కార్యక్రమంలో పాల్గొని బాలయ్య చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే మండలంలోని ఇందిరానగర్ మాజీ సర్పంచ్ వరాలు తనయుడు భూషణం ఇటీవల మృతి చెందగా ఆయన కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బత్తలవల్లం ఎంపీటీసీ కస్తూరి ఇటీవల తండ్రిని కోల్పోయింది. ఆమె కుటుంబ సభ్యులను రాజేష్ పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయుడు , దయాకర్ రెడ్డి, హరిబాబురెడ్డి, చిన్నా, దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్ బాబు, భాస్కర్, శివా యాదవ్, పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, వేణు, నరేంద్ర ఉన్నారు.



కంచరపాళెంలో బాలయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

పోరుబాటకు కదంతొక్కాలి

- 13న జరిగే ర్యాలీని జయప్రదం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపు

వరదయ్యపాళెం : అన్నదాతలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వంపై ఈనెల 13న తిరుపతి జిల్లా కేంద్రంలో జరిగే నిరసన ర్యాలీకి పెద్దఎత్తున సత్యవేడు నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు తరలి వచ్చి మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. బుధవారం వరదయ్యపాళెం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాతలకు అండగా నిలిచేందుకు ఈ నెల 13న తిరుపతిలో భారీ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి రైతు సమస్యలపై వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం మొద్దు నిద్రను తట్టిలేపుతామన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం చంద్రబాబు రైతులకు వివిధ హామీలు ఇచ్చారని రాజేష్ ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. కూటమి నాయకులు అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించి మోసం చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఉచిత పంటల బీమా అమలు చేసి రైతులను ఆదుకుంటే నేడు చంద్రబాబు ఆ పథకానికి పంగనామాలు పెట్టారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఈ సమయంలో వారికి అండగా నిలబడేందుకు కూటమి సర్కారుపై వైఎస్సార్ సీపీ పోరుబాటకు సిద్ధమైందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, ప్రచార కమిటీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ హరిబాబు రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివా యాదవ్, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బీఎన్‌కండ్రిగ ఎస్సీ సెల్ కన్వీనర్ గురవయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న నూకతోటి రాజేష్

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

రేణిగుంట : ఈనెల 13న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో చేపట్టనున్న 'రైతులకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రేణిగుంట మండలం అధ్యక్షుడు గంగారి రమేష్, ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యాయాదవ్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులను మోసగించిందని దీనికి నిరసనగా ఈనెల 13వ తేదీన తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రాలను అందించే కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

భక్తజనసంద్రమైన శ్రీకాళహస్తి

ఏడుగంగల జాతరతో జంగమయ్య క్షేత్రం పులకించిపోయింది. సప్తగంగల వైభవాన్ని చాటుతూ జరిగిన ఏడుగంగల జాతర ప్రాభవాన్ని చూసి తరించేందుకు తరలివచ్చిన అశేష భక్తులతో శ్రీకాళహస్తి జనసంద్రమైంది.

- వైభవంగా ఏడుగంగల జాతర
- సమస్తలోకాలను పాలించే చల్లనితల్లి
- భక్తుల కోరికలను అనుగ్రహించే కల్పవల్లి
- అనంత ప్రాణకోటిని రక్షించే తల్లి



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలో రెండు రోజులుగా ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఏడుగంగమ్మల గుడి వద్ద నుంచి ఏడుగురు గంగమ్మలను ఆయా జాతర కమిటీలు మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. ఏడుగంగమ్మల ఊరేగింపు వైభవాన్ని చూసేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చి, అమ్మలను దర్శించుకుని, హారతులిచ్చారు. పిండి దీపాలు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యం సమర్పించారు. గంగమ్మల ఊరేగింపులో ఏర్పాటు చేసిన మేళతాళాలు, దేవతా కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ముతాలమ్మ గుడి వద్ద ప్రత్యేక హారతులు సమర్పించిన తరువాత పెండ్లిమండపం వరకు వేంచేపు చేసి, మొదటి గంగమ్మను స్థాపించారు. భద్రకాళీలా భక్తులకు మొదటి గంగమ్మ పొన్నాలమ్మ రూపంలో కనువిందు చేసింది. అనంతరం గాంధీవీధి గంగమ్మ కోనేరు పక్కన కుమారస్వామి ఆలయ సమీపంలో కొలువుదీరింది. ఈమె అంకమ్మ విశ్వరూప ప్రశాంతమయి కరిరాజుపై త్రిశూలం ధరించి బంగారుచీర ధరించి, తలపై కొప్పుతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించింది. భేరివారి మండపం వద్ద ప్రశాంత చిత్తంతో ముత్యాలమ్మ అమ్మవారు శూలం చేతపట్టి, ఎర్రని చీర ధరించి ఆకట్టుకునేలా దర్శనమిచ్చారు. జయరామరావువీధిలో కావమ్మ రథంపై ధనస్సు పట్టి భక్తులకు కనువిందు చేశారు. సన్నిధివీధిలో వెండి కవచాలతో, వెండి సింహవాహనంపై వెండి ఛత్రం కింద పెద్ద శేషుడిని కిరీటంగా ధరించి, నాలుగు భుజాలతో అంకాళమ్మ ఆసీనురాలై భక్తులకు దర్శనమిచ్చింది. బ్రాహ్మణవీధిలో కలశం, కమలం, 46 చేతులతో నల్లగంగమ్మ జ్ఞానప్రసాదినిగా భక్తులకు కనువిందు చేసింది. కొత్తపేట భువనేశ్వరి అమ్మవారు ఎనిమిది చేతుల ఆయుధాలు ధరించి, మృగరాజులే రథసారథులుగా నిలవగా రథంపై కొలువుదీరి, భక్తులను అనుగ్రహించింది. అనంతరం రాత్రి 7 గంటలకు అమ్మవార్లకు ఏడుగంగమ్మల ఆలయం వద్ద నిమజ్జనం చేశారు.